క్లుప్తంగా

చీరాల ఎక్సైజ్ ఎస్సైగా నాగేశ్వరరావు

చీరాల: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ చీరాల ఇన్‌స్పెక్టర్‌గా పి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఇన్‌స్పెక్టర్ల జాబితాను విడుదల చేయగా చీరాల ఇన్‌స్పెక్టర్‌గా పి.నాగేశ్వరరావు నియమితులయ్యారు.

ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న చిన్నారులు

మార్టూరు: మార్టూరులోని అమ్మ అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు ఆదివారం దాతలు దుప్పట్లు పంపిణీ చేశారు. మన్నె వెంకట సాయి సంజయ్ పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు వాణి, శ్రీనివాసులు ఉపాధ్యాయుడు రావి ఎల్లమందయ్య చేతుల మీదుగా ఆశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మరో ఉపాధ్యాయురాలు లలిత భర్త శ్రీనివాసరావులు ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత


ల్యాప్‌టాప్‌లను అందిస్తున్న ఆవోపా ప్రతినిధులు

చీరాల అర్బన్: ఆవోపా చీరాల ఆధ్వర్యంలో వలివేటి మురళీకృష్ణ, జయశ్రీ ఆవోపా స్టూడెంట్ ల్యాప్‌టాప్ స్కీం ద్వారా ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందించారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేందుకు స్కీమ్ ద్వారా ల్యాప్‌టాప్‌లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మారుటూరి రాఘవేంద్రరావు, గౌరవఅతిథిగా మద్దు వెంకటసుబ్బారావు, అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, కార్యదర్శి కోడూరి ఏకాంబరేశ్వరబాబు, కోశాధికారి పేర్ల వెంకటరామయ్య, ప్రాజెక్టు చైర్మన్ కోట రమేష్, గాదంశెట్టి సుబ్రహ్మణ్యం, విశ్వం, పోలిశెట్టి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

చీరాల అర్బన్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి హాస్పిటల్ గుంటూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ చుండూరి నాగేశ్వరరావు, లలిత దంపతుల సహకారంతో ఆదివారం స్థానిక ఎన్‌వీఎస్అండ్ఎస్‌జెఆర్ ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 430 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 96 మందికి కంటి పరీక్షలు అవసరమని గుర్తించారు. శంకర్ నేత్రాలయం నుంచి ప్రత్యేక వైద్యబృందం కంటి నరాలు, రెటీనా పరీక్షలతో పాటు షుగర్, బిపి పరీక్షలు చేశారు. 30 మందిని ఆపరేషన్ నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు శ్రీరాం సురేష్, శ్రీరాం వేణుగోపాల్, రత్నాకర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులు అమ్ముకుంటున్నారు.. !

సోమశేఖర్ (పేరు మార్చాం).. స్థానిక చీరాలలో పేరొందిన ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. మూడేళ్లు బాగానే చదువుకున్నాడు. కానీ చివరి ఏడాదికి వచ్చేసరికి పూర్తిగా గాడి తప్పాడు. చెడు స్నేహంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ఇక అంతే లక్షల్లో అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం తెలియక ఇటు కాలేజీకి, అటు ఇంటికి వెళ్లకుండా ఎటో తిరుగుతున్నాడు. చివరికి తల్లిదండ్రులకు విషయం తెలియడంతో తెలిసిన వాళ్ల దగ్గర నుంచి డబ్బు తెచ్చి అప్పులు తీర్చారని సమాచారం. ఇలా సోమశేఖరే కాదు చాలా మంది యువత చెడుదారిలో వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు..



- జూదాలతో పెడదోవపడుతున్న యువత
- జోరుగా ఆన్‌లైన్ జూదం, సింగిల్ నంబరు, పేకాట
- బానిసలవుతున్న యువకులు
- అప్పులపాలై ఆస్తులు అమ్ముకుంటున్న తల్లిదండ్రులు

వేటపాలెం: ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల కలలను పిల్లలు చిదిమేస్తున్నారు. చదువు పూర్తయ్యాక ఏదో ఒక ఉద్యోగం సాధించి కుటుంబానికి తోడుగా ఉంటారనుకున్న కొడుకులు అక్కరకురాకుండా పోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజవర్గ పరిధిలో పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా జీవిస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది యువత అనేక వ్యసనాల బారిన పడుతున్నారు. ప్రధానంగా 15 నుంచి 40 ఏళ్ల లోపు యువత ఆన్‌లైన్ జూదాలకు బానిసలవుతున్నారు. చిన్నతనం నుంచి తల్లిదండ్రులు మొబైల్ ఫోన్‌లు వారి పిల్లలకు అందుబాటులో ఉంచడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తుంది. ప్రాథమికంగా యువకులు మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడటానికి బానిసలవుతున్నారు. ఆ తరువాత క్రమేపి ఆన్‌లైన్ జూదాలకు అలవాటుపడి వాటికి బానిసలవుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగులు అందుబాటులోకి రావడంతో వాటిపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. పల్లె, పట్టణాలలో విద్యార్థులు ఆన్‌లైన్ జూదం వలలో చిక్కుకుని భారీగా నష్టపోతున్నారు. రెట్టింపు డబ్బు వస్తుందనే ఆశతో కమీషన్ అధికవస్తుందని పెద్ద మొత్తంలో జమచేస్తుంటారు. ఈ బెట్టింగుల్లో కమీషన్ రూపంలో ఆన్‌లైన్ కంపెనీలు వీరి వద్ద నుంచి నగదు లాగేసుకుంటాయి. చీరాల ప్రాంతంలో పలు ప్రాంతాల్లో వెలుగు చూస్తున్న కొన్ని ఘటనలే దీనికి ఉదాహరణగా కనిపిస్తుంది.

కుటుంబాలను తలకిందులు చేస్తున్న జూదం..

ఆన్‌లైన్ బెట్టింగ్ ఎందరో జీవితాలను తలకిందులు చేస్తున్న మాయదారి జూదం. సామాన్య, మధ్య తరగతి వర్గాల నుంచి ధనవంతుల వరకు, యువత నుంచి మధ్య వయస్సు వరకు ఎందరో దీని బాధితులే. సులభంగా కష్టపడకుండా డబ్బులు సంపాదించొచ్చని, అదృష్టం వరిస్తే ఒకేసారి లక్షాధికారులు కావొచ్చని ఆశ. చిన్న మొత్తం వెచ్చించి పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించితే కష్టాలు తొలగిపోతాయని భావిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు దిగుతున్నారు. క్రమంగా ఇదో వ్యసనంగా మారిపోయి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. తాము భరించలేనంత అప్పులు చేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

జూదాల వ్యసనం. నష్టాలు చవిచూసి..

ప్రస్తుతం పరిస్థితుల్లో స్మార్ట్ ఫోన్‌లేని వ్యక్తి అంటూ ఎవరూ ఉండరు. నెట్ సేవలు సులభంగా అందుబాటులోకి రావడంతో ఆన్‌లైన్‌లో ఆటలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. వందలతో మొదలై వేలు, లక్షలు చేతులు మారిపోతున్నాయి. ఫోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుని తిరిగి చెల్లించ లేని వారి బంధువులు, మిత్రులకు అసభ్యంగా ఉండే చిత్రాలను మార్ఫింగ్ చేసి పంపుతున్నారు. పరువు కాపాడుకునేందుకు అప్పులు చేసి రుణాలు చెల్లిస్తున్నారు.

సులభంగా డబ్బు సంపాదించాలని..

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో కొందరు యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, రమ్మీ, లోడో, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లు చేస్తున్నారు. మొదట సరదాగా మొదలు పెట్టి వాళ్లు చివరకు అప్పులు ఊబిలో కూరకుపోతున్నారు. దీనికితోడు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు చాలానే ఉన్నాయి. వీటితో సింగిల్ నంబర్ గేమ్‌కు బానిసలవుతున్నారు. వీటిపై వల పన్నినా సైబర్ నేరగాళ్లు ఖాతాలను హ్యాక్ చేసి డబ్బంతా లాగేస్తున్నారు.

☛ ఇలానే కొత్తపేటలో నివాసం ఉండే ఒక వ్యక్తి ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఆ వ్యక్తి ఆన్‌లైన్ గేమ్‌కి అలవాటు పడి దాదాపు రూ.5 లక్షలు పోగొట్టుకొన్నాడు.

☛ వేటపాలేనికి చెందిన ఒక వ్యాపారవేత్త కుమార్తె ఇంజినీరింగ్ చదువుతూ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడింది. బెట్టింగ్ గేమ్స్ ఆడుతూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని తన బ్యాంకు ఖాతా నుంచి రూ. 50 వేలు పోగొట్టుకుంది.

☛ వేటపాలెం గడియార స్తంభం సెంటర్‌లో బడ్డీ కొట్టు నడుపుకొనే అతను సింగిల్ నంబర్ జూదానికి వ్యసనంగా మారి అప్పులు పాలయ్యాడు. కొందరు తాము మోసపోయామని పోలీసులకు ఫిర్యాదు చేసేవారు తక్కువగా ఉన్నారు. మోసపోయామని చెప్పుకొంటే పరువు పోతుందని మిన్నకుండిపోయే వారి శాతం ఎక్కువగా ఉంది.

పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉండాలి..




పిల్లలు, యువకులపై వారి తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. వారికి అనవసరంగా డబ్బు, సెల్ ఫోన్‌లు ఇవ్వడం మంచిది కాదు. ఆన్‌లైన్‌లో వివిధ రకాల మోసపూరిత గేమ్స్ ఉంటాయి. ఆ గేమ్స్‌లకు అలవాటు పడి బెట్టింగ్‌లపై దృష్టి సారిస్తున్నారు. సరదాగా జూదం అంటూ ఆ తర్వాత వ్యసనంగా మార్చుకుంటున్నారు. అలాంటి వారిని తమకు అప్పగిస్తే కౌన్సెలింగ్ ద్వారా మార్పు తీసుకొస్తాం. సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకనాన్‌లైన్ జూదగాళ్ల ఆట కట్టించేలా చర్యలు చేపడుతున్నాం.

– ఎం వెంకటేశ్వర్లు, ఎస్సై, వేటపాలెం

రేపటి నుంచి పొలం పిలుస్తోంది

బల్లికురవ: పొలంబడి–పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మంగళ, గురువారాల్లో నాలుగు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ అధికారి ఎస్‌వీపీ కుమారి ఆదివారం తెలిపారు. మంగళవారం కొణిదెన, రాజుపాలెం గురువారం నక్కబొక్కలపాడు, మల్లాయపాలెం, గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని వ్యవసాయ శాఖపరంగా సూచనలు పొందాలని కుమారి కోరారు.

దసరా ఉత్సవాలకు దుర్గమ్మ సన్నిధి సిద్ధం


ఉత్సవాలకు సిద్ధమవుతున్న దుర్గమ్మతల్లి

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గాలయంలో అమ్మవారు దసరా సరన్నవరాత్రి మహోత్సవాలకు ముస్తాబవుతున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో మాదిరిగానే కారంచేడులో దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు, ఆలయ అర్చక స్వాములు తెలిపారు. సెప్టెంబర్ 3వ తేదీ అమ్మవారు స్వర్ణ, రజిత కవచ అలంకరణలో దర్శనమిస్తారన్నారు. 4వ తేదీ బాలా త్రిపురసుందరీదేవిగా, 5వ తేదీ గాయత్రీదేవిగా, 6వ తేదీ అన్నపూర్ణాదేవిగా, 7వ తేదీన మహాలక్ష్మీదేవిగాను, 8వ తేదీ లలితాదేవిగా, 9వ తేదీ మహాసరస్వతీదేవి అలంకరణ, 10వ తేదీ దుర్గాదేవి అలంకరణ, 11వ తేదీ మహిషాసురమర్దినీ, 12వ తేదీ చివరి రోజు కావడంతో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రత్యేకంగా 9వ తేదీన పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పది రోజుల పాటు అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతాయన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు


జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికైన కొండమంజులూరు విద్యార్థులు


చెరుకూరులో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పర్చూరు (చినగంజాం):

స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి ఆటల పోటీలకు చెరుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెంజిమన్ హనూక్ తెలిపారు. ఇంకొల్లు మండలం గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల నందు ఈ నెల 28 వతేదీ పర్చూరు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలలో చెరుకూరు విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఉదయభాస్కరరెడ్డి తెలిపారు. అథ్లెటిక్ విభాగంలో 12 మంది, వాలీబాల్ విభాగంలో 4, కబడ్డీలో ఇద్దరు, ఖోఖోలో 8 మంది, యోగాలో ఇద్దరు, చెస్ నందు ఒక్కరు మొత్తం 29 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఎంపికై న విద్యార్థులను పర్చూరు ఎంఈఓలు సక్యానా రాయణ, వెంకటరామయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.


పోటీల్లో విజేతలుగా నిలిచిన బల్లికురవ కేజీబీవీ బాలికలు

సత్తా చాటిన కొండమంజులూరు క్రీడాకారులు..

జే.పంగులూరు: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 16 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు హెచ్ఎం ఐ అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ జరుగుతున్న పోటీలలో కొండమంజులూరు బాలబాలికలు సత్తా చాటారు. మండల స్థాయి క్రీడా పోటీలకు పాఠశాల నుంచి 34 మంది క్రీడాకారులు నియోజకవర్గస్థాయికి ఎంపికయ్యారు. వారిలో 16 మంది క్రీడాకారులు మంచి సత్తా చాటి జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటిన బల్లికురవ విద్యార్థులు

బల్లికురవ: నియోజకవర్గస్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో బల్లికురవ కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయం బాలికలు ప్రతిభతో సత్తా చాటారు. ఆదివారం విద్యాలయంలో బాలికలకు ప్రిన్సిపల్ కోనా సరళ కుమారి, పీఈటి స్వర్ణలత, ఉపాధ్యాయులు అభినందించారు. మేదరమెట్లలో జరిగిన అథ్లెటిక్స్ అండర్–14, 17, లాంగ్ జంప్, 1500 మీటర్ల రన్నింగ్, హైజంప్‌లో పీ. జేస్సీ, జీ. రాజేశ్వరీ, ఆర్ నవీన బీ. నాన్సీ ప్రతిభ చూపారు. ఏల్చూరిలో జరిగిన బాడి ఖోఖో యోగా, షటిల్ బాడ్మింటన్ లో ఏ. లక్ష్మీ ప్రసన్న, జీ. రాజేశ్వరీ, కే. హేమలత, జే. దీక్షిత, పీ. బుజ్జి, జీ.సంగీత ఎం. ప్రేమ స్యోతి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.


ఉన్నా.. లేకపోయినా ఒకటే



చీరాలనగర్ పంచాయతీలో సక్రమంగా పని చేయని ట్యాంకు


బోయినవారిపాలెంలో ఒట్టిపోయిన మంచినీటి పథకం

చీరాల టౌన్: ప్రజలకు తాగునీరు అందించేందుకు పదేళ్ల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకుల్లోని చుక్క నీరు కుడా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తీరప్రాంత గ్రామాలైన వాడరేవు పంచాయతీ కార్యాలయం వద్ద, బోయినవారిపాలెం గ్రామంలోని రచ్చబండ వద్ద, పిట్టువారిపాలెం పంచాయతీ కార్యాలయం ఎదురు, కొత్తపాలెం పంచాయితీ కార్యాలయం సమీపంలో, శవనంవారిపాలెంలో, పాత చీరాల, పిట్టువారిపాలెం ఎస్సీకాలనీ, కావూరివారిపాలెం తదితర గ్రామాల్లో 5000 లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకులను, విద్యుత్ మోటార్లను ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. పథకం ప్రారంభం తర్వాత కొద్ది రోజులు మాత్రమే పనిచేసిన ఈ మంచి నీటి ట్యాంకులు సంవత్సరాల నుంచి మూలన చేరాయి. ఏళ్లగడుస్తున్నా వీటి నుంచి చుక్క మంచి నీరు కూడా రాకపోవడంతో పథకం అటకెక్కింది. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో మూలనచేరిన మంచినీటి పథకాలకు మరమ్మతులు చేయించి తాగు నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

తీరంలో పర్యాటకుల ఇబ్బందులు


సముద్రంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


తీరం ఒడ్డున సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు

చీరాల టౌన్: వాడరేవు సముద్రతీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో చీరాల, పర్చూరు, గుంటూరు, చిలకలూరిపేట ప్రాంతాలకు చెందిన పర్యాటకులతో పాటుగా, తెలంగాణా రాష్ట్రంలోని హైద్రాబాద్ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపారు. అధికసంఖ్యలో పర్యాటకులు వస్తారని అధికారులు, పంచాయతీ సిబ్బందికి తెలిసినప్పటికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. తీరం ఒడ్డున మహిళలు దుస్తులు మార్చుకునే సౌకర్యం, తాగునీరు, నిలువనీడ లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తీరం ఒడ్డున కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై అధికారుల తీరుపై పర్యాటకులు విమర్శలు చేస్తున్నారు. తీరప్రాంతంలో పర్యాటకులకు వసతులు కల్పించి, గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకే టోల్‌గేట్ ఏర్పాటు చేసి కార్లకు, ఇతర వాహనాలకు టోల్ పన్ను వసూలు చేస్తున్నామని బాహాటంగా చెప్తున్నారు. మరి వారాంతాలు, సెలవు దినాల్లో ఎందుకు వసతులు కల్పించడం లేదో చెప్పాలని పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం


డివైడర్‌పై విపరీతంగా పెరిగిన చిల్లచెట్లు


ధ్వంసమైన చినగంజాం గ్రామానికి చెందిన హెచ్చరిక బోర్డు

చినగంజాం: చీరాల–ఒంగోలు జాతీయ రహదారిపై అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులకు, ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారుతుంది. హైవే అధికారుల నిర్వాహణ లోపం కారణంగా తరచుగా రోడ్లపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారి కావడంతో వాహనాలు సుమారు 100 నుంచి 120 కి.మీ వేగంతో దూసుకు పోతున్నాయి. అలాంటి సందర్భాలలో పాదచారులు, ద్విచక్రవాహనదారులు, భారీ వాహనచోదకులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ఒక టూరిస్టు బస్సు ప్రయాణికుల పైకి వెళ్లి తీవ్ర ప్రమాదం చోటుచేసుకున్న ఘటన సంభవించింది. ఇక ద్విచక్రవాహనాల ప్రమాదలకు లెక్కే లేకుండా ఉంది. ప్రధానంగా జాతీయ రహదారిపై పలు సమస్యలు చోటు చేసుకునే ఇబ్బందులు గురిచేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు మధ్యలో డివైడర్‌పై చిల్ల చెట్లు విపరీతంగా పెరిగిపోవడంతో వాహన చోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రోడ్డు కిరువైపులా ద్విచక్ర వాహనాలకోసం ప్రత్యేకంగా కేటాయించిన మార్గంలో చిల్లచెట్టు పెరిగి రోడ్డు పైకి రావడంతో ద్విచక్రవాహన దారులు, పాదచారులు ఎదురు వాహనాలు కన్పించక ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరుకోగా బిచ్చగాళ్లకు, మందుబాబులకు, ఆసాంఘిక శక్తులకు ఆచూకీ మారుతున్నాయి. ముఖ్యంగా రాత్రిళ్లు చినగంజాంకు చెందిన ప్రయాణికులు బస్సు దిగి రావాలంటే విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామంలోకి వచ్చే వాహనాలకు ప్రయాణికులకు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు సైతం శిథిలమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయమై జాతీయ రహదారి సిబ్బందిని సమాచారం అడుగగా గతంలో ఉన్న రోడ్డు నిర్వాహణ కాంట్రాక్టు పూర్తి అయిందని కొత్తగా కాంట్రాక్టు ఇచ్చే వరకు తాత్కాలిక పనులు మాత్రం చేస్తాం అని సమాధానం ఇచ్చారు.



శిథిలావస్థకు చేరిన చినగంజాం బస్టాప్

ప్రమాదకరంగా గుంత



జే.పంగులూరు: పంగులూరు, అరికట్లవారిపాలెం గ్రామాల మధ్యఆర్‌అడ్‌బీ రోడ్డుకు గుంట పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బుదులు పడుతున్నారు. మోటారు సైకిళ్ల మీద వెళ్లే అనేక మంది గుంత తెలియక గాయాల పాలవుతున్నారు. ఇంకొల్లు నుంచి జాతీయ రహదారిపైకి రావాలంటే ఈ రోడ్డు వెంటనే రావాలి. స్థానికులే స్పందించి గుంత మధ్యలో కర్రలు పాతి ఎర్ర గుడ్డ కట్టారు. అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చాలని అధికారులకు కోరుతున్నారు.

ఆంధ్ర మహాభారతం అద్భుత గ్రంథం


సృజన కవి దంపతులను సన్మానిస్తున్న సృజన సభ్యులు

అద్దంకి రూరల్: ఆంధ్ర మహాభారతం అద్భుత గ్రంథమని వక్తలు పేర్కొన్నారు. అద్దంకిలోని సాహిత్య, సంస్కృతిక, సంగీత వాద్య కళాకారుల సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చిన్న శాంతయ్య పిచ్చమ్మ గార్ల సేవాసదన్‌లో సృజన కవులు గాడేపల్లి దివాకరదత్తు, జ్యోతిష్మతి, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, శైలజ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి కె. అనిల్‌కుమార సూరి అధ్యక్షత వహించారు. షేక్ మస్తాన్ ప్రధానోపాన్యాసం చేశారు.

ఆంధ్ర మహాభారతం అద్భుత గ్రంథమని, గ్రంథాన్ని అన్ని వర్గాల వారు చదవవచ్చన్నారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాగాయిత్రి అన్నమనేని వెంకటరావు, చెన్నుపాటి రామాంజనేయులు, జ్యోతి చంద్రమౌళి, ఉబ్బాదేవపాలన, పంతంగి ఆంజనేయులు, షేక్‌మహ్మమద్ రఫీ, కొల్లా భువనేశ్వరీ కవులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

చీరాల రూరల్: దేశంలో బీసీ జనాభా 60 శాతం కంటే ఎక్కువగా ఉన్నప్పటికి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారికి తీరని అన్యాయం జరుగుతుందని.. తక్షణమే కేంద్రం స్పందించి బీసీ కుల గణన చేపట్టాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. అక్టోబర్ 9న విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం స్థానిక గడియార స్తంభం సెంటర్లోని మహాత్మా పూలే విగ్రహం వద్ద బీఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు కాటి మార్క్, దుడ్డు భాస్కరరావు, గొర్రెపాటి రవికుమార్‌లు మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టాలని ఎంతో కాలంగా బీసీలు అడుగుతున్నప్పటికి ప్రభుత్వాలు దాటవేసే దోరణి అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. బీసీ కులాల గణన జరిగితే ఈ దేశంలోని రాజకీయాలలో పెనుమార్పులు జరిగే అవకాశం ఉందన్నారు. విజయవాడలో అక్టోబర్ 9న తలపెట్టిన మహాధర్నాకు బీసీ సంఘాలు, కుల సంఘాలు, బీసీలు, బహుజనులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో భగత్ సింగ్, బీసీ ఫెడరేషన్ నాయకులు ఊటుకూరి వెంకటేశ్వర్లు, కుంచాల పుల్లయ్య, బాజీ షరీఫ్, వంశీ, సుధాకర్, శ్రీను, జిలాని, తదితరులు పాల్గొన్నారు.